


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక - పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

**ఐతే....**

ఒకప్పుడు రుక్మిణి ఇలాగే అగ్నిజోతనుడు అనే బ్రాహ్మణుడిచేత తన ప్రియుడైన శ్రీకృష్ణునికి లేఖ పంపింది. పంపేక ఆమె మనసు తేలిక పడిందా – లేదు. గజేంద్రమోక్షంలో 'సిరికిం జెప్పడు' అన్నట్లే – అప్పటి రుక్మిణి మనోభావాల్ని సర్వకాలీనంగా విశ్లేషించిన పోతన ఘనతకి అప్పటి నా మనోభావాలే గొప్ప నిదర్శనం.

ఘనుడా భూసురుడేగెనో

ఇండియాలో కలకత్తాలో జరుగుతున్న ఏర్పాట్ల విషయంలో నా పాత్ర పూర్తయింది. అక్కడ వాళ్లు చెయ్యగలిగింది చేస్తే – ఇక్కడ నేను నావాళ్లని రిసీవ్ చేసుకుందుకు జనవరి ఏడున సిద్ధంగా ఉండాలి.

ఐతే దిగితే కానీ లోతు తెలియదన్న సామెతని మర్చిపోలేదు. అందుకని నా సమస్య లోతుల్ని అవగాహన చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను.

మనిషి సంఘజీవి అంటారు కానీ – నాది మాత్రం ఏకాంతాన్నీ, ఒంటరితనాన్నీ ఎక్కువగా ప్రేమించే తత్వం. అలాంటి నేను ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఒంటరితనానికి భయపడుతున్నాను. ఒకే దారిలో వెదుతూ కలవరపెట్టే నా ఆలోచనల దారి మళ్లించడానికి స్నేహితులకు మించిన సాధనం ఉండదనిపించింది.

మనిషి సంఘజీవి. ఏకోన్ముఖుడు కూడా మనిషే కదా! ఏకాంతాన్ని ఎక్కువ ఇష్టపడ్డా సమాజాన్ని వదిలి వెళ్లడుగా! అంటే సమాజమంటే ఇష్టమే కదా! అంటే ఏకోన్ముఖుడితో సహా ఏ మనిషైనా సంఘజీవే మరి!

అప్పటికే నాకు మంచి మిత్రులు చాలామందే ఏర్పడ్డారక్కడ. అవసరానికి ఆదుకునేవాడే నిజమైన మిత్రుడంటుంది ఆంగ్ల సామెత. ఆ సామెతని ఆసరా చేసుకుని, నిజమైన మిత్రుల్ని గుర్తించాల్సిన సమయం వచ్చిందనిపించింది నాకప్పుడు.

నేను ఇండియాకి టికెట్లు పోస్టు చేసింది డిసెంబర్ 20న. ఆ రోజు శుక్రవారం. తర్వాత శని ఆదివారాలు ఎలాగూ సెలవులే. సోమవారం అనగా డిసెంబర్ 23 ఒక్క రోజుకి ఆఫీసుంది. ఆ మర్నాడు అంటే డిసెంబర్ 24 నుంచి క్రిస్మస్ సెలవులు మొదలు. తర్వాత మళ్లీ ఆఫీసు తెరిచేది జనవరి 2నే.

జర్మనీలో క్రిస్మస్ రోజుల్ని వైనాక్టెన్ అంటారు. మనకు సంక్రాంతిలా అది వారికి పెద్ద పండుగ.

అసలే సంపన్న దేశం. ఆపైన వైభవాన్ని ప్రదర్శించే తత్వమున్న ధనస్వామ్య దేశం. ఆ వేడుకలు చూడ కళ్లు చాలవు కదా!

ఎక్కడ చూసినా కళ్లు చెదిరేలా అలంకరణలు. ఉత్తప్పుడే పండుగ రోజుల్ని మరిపించే దుకాణాలు, పండుగ ఆలంకరణలతో మరింత శోభాయమానమయ్యాయి.

పాశ్చాత్యుల పండుగ వేడుకలు వారి దేశంలోనే చూడ్డం ఒక అపూర్వావకాశం. కానీ ఆ వేడుకలు నాలో అంతగా ఉత్సాహాన్ని నింపలేదు.

కొద్ది రోజుల్లో నావాళ్లు వస్తున్నారని తెలిసేక – ఎక్కడ ఏ వింత చూసినా – కొద్ది రోజులు ముందొచ్చి ఉంటే మావాళ్లూ చూసి ఉండేవారు కదా అనిపించేది. వాళ్లతో పంచుకోలేకపోతున్నానన్న బాధ కలిగి, అదో రకం దిగులు నన్నావహించేది.

క్రిస్మస్ వేడుకలకి వీధులన్నీ అలంకరించబడ్డాయి. ఎన్నోచోట్ల కొత్త కొత్త తీర్థాలొచ్చాయి. అవి ల్యానబర్గులో చూసిన తీర్థాలకంటే గొప్పగా ఉన్నాయి.

మన దేశంలోనే తీర్థాలు ఎంతో బాగుంటాయి. ఆ తీర్థాలకు ఆధునిక సదుపాయాలు తోడయ్యాయిక్కడ. రంగులరాట్నాలే కాక, రకరకాల ఆటలున్నాయి.

అక్కడ చిన్నపిల్లలు హుషారెక్కి ఆటలాడేవారు. వాళ్ల ఆటల్ని మెరిసే కళ్లతో గమనించేవారు తలిదండ్రులు. వాళ్లని చూస్తుంటే నాకు నావాళ్లు గుర్తుకొచ్చి మనసు పాడయ్యేది.

ఇన్ని వైభవాలమధ్య, ఆకర్షణల మధ్య – నా మనసు కేవలం నావాళ్ల చుట్టూ పరిభ్రమించడానికి కారణం – భారతీయ వైవాహికవ్యవస్థ ప్రత్యేకత అనిపిస్తుంది నాకు.

యూరోపియన్సుకి క్రిస్మస్ చాలా ముఖ్యమైన పండుగ. కుటుంబ సభ్యులందరూ ఏదో ఒకచోట కలుసుకునే సందర్భం కూడా వారికిదే!

అదలాగుంచితే – ఇక్కడ అభిమానాన్ని కాసులతో కొలుస్తారు. బంధుమిత్రులు పరస్పరానురాగాన్ని వ్యక్తపర్చుకుందుకు – కానుకలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇచ్చిన బహుమతి నాణ్యతను బట్టీ, ఖరీదునుబట్టీ – అనురాగాల అంచనా ఉంటుంది.

లాబొరెటరీలో నా కొలీగ్ కిర్షనర్‌కి ఫొటోగ్రఫీ హాబీ. అతడివద్ద ఖరీదైన కెమేరా ఉంది. ఈ క్రిస్మస్‌కి అతని తండ్రి సుమారు రెండువేల మార్కులు పెట్టి కెమేరాకి కొత్త అటాచ్‌మెంట్స్ కొనిచ్చాడు. వాటినతను లాబ్‌లో మాకు చూపించి తెగ మురిసిపోయాడు.

తండ్రీ బిడ్డలే కాదు – భార్యాభర్తలు కూడా ఒకరికొకరు కానుకలిచ్చుకుంటారు క్రిస్మస్ సమయంలో. వారి దాంపత్య జీవితంపైన ఆ కానుకల ప్రభావం – మళ్లీ క్రిస్మస్ దాకా ఉంటుంది. పండుగ పేరు చెప్పి భార్యాభర్తలు కూడా ఒకరికొకరు విధిగా కానుకలిచ్చుకోవడమనేది నాకు చిత్రమనిపించింది.

మా ఇంట్లో ఎకానమీ వేరు. ఆదాయాన్ని బేరీజు వేసుకుని, అవసరాల్ని బట్టి ఎవరికి ఏమవసరమో పరస్పరం చర్చించుకుని – కొనుగోళ్లు చెయ్యడం మా పద్ధతి. మా వద్దనున్న డబ్బు మా ఇద్దరిదీ. దాని వినియోగ బాధ్యత కూడా మా ఇద్దరిదీ. రివాజుగా కానుకలు కాక – అవసరాన్నో, సందర్భాన్నో పురస్కరించుకుని – కొనుగోలు చేయడం మా అలవాటు. అవసరాలకి మించిపోయిన ఆదాయం ఉంటే – బహుశా మా ఆలోచనలూ ఇక్కడి ధోరణిలోనే ఉండేవేమో!

ఏదేమైనా దంపతులు ఒకరినొకరు కానుకలతో మెప్పించాలనే భావన నాకంతగా మింగుడు పడలేదు.

డిసెంబర్ 21 శనివారం ఉదయం పెందరాళే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, బ్రెడ్ తినేసి ఓంప్రకాష్ ఉండే హాస్టలుకి వెళ్లిపోయాను.

రోగానికి రొష్టంటారు కదా! ప్రస్తుతం నా సమస్యే నా రోగం. దాన్ని హాస్టలు మిత్రుల మధ్య చర్చకి పెట్టాను.

ఏరోఫ్లోట్‌లో బెర్లిన్ రావడం చాలామందికి మామూలేననీ, బెంగపడాల్సిందేం లేదనీ కొందరు నాకు ధైర్యం చెప్పారు.

ఒకతనికి ఈస్ట్ జర్మనీలో ఓ గర్ల్‌ఫ్రెండుందట. అవసరమైతే ఆమె సాయం తీసుకోవచ్చన్నాడు.

ఓసారి నేను, ఓంప్రకాష్ – అక్కణ్ణించి వెళ్లి – ఈస్ట్ జర్మనీకి వీసా ఇచ్చే ఆఫీసు, ఏరోఫ్లోట్ ఆఫీసు చూసుకొచ్చాం. అన్నింటికీ సెలవులే. తలుపులు మూసి ఉన్నాయి. వెనక్కి వచ్చేక, "ఈ రోజంతా నువ్విక్కడే గడపాలి" అని హాస్టల్ మిత్రులు బలవంతపెట్టారు.

రోగి కోరిందే వైద్యుడు మందుగా ఇస్తే కాదనడానికేముంది – సరేనన్నాను.

శనివారం సెలవు కదా – మామూలుగా ఆ రోజు వాళ్లంతా కలిసి భారీగా వంటలు చేస్తారు.

ఆ రోజు ఘుమఘుమలాడే మసాలా పెట్టి లేడిమాంసంతో కూర చేశారు కొందరు. ఓంప్రకాష్ నాకోసం వంకాయ పెరుగుపచ్చడి చేశాడు. అతడది చేసిన విధానం కొత్తగా ఉంది నాకు.

ముందుగా పెరుగు తీసుకుని దానిలో ఉప్పు, పచ్చిమిర్చి, పసుపు, కొత్తిమీర వగైరాలు వేశాడు. తర్వాత పోపు పెట్టాడు. అప్పుడు వంకాయలు తీసుకుని మందంగా చక్రాల్లా తరిగి ఒకొక్క చక్రాన్నే విడివిడిగా నూనెలో వేసి అటు తిప్పి ఇటు తిప్పి వేయించాడు. వేగిన ముక్కల్ని పెరుగులో వేసి ఆవడల్లా నానబెట్టాడు.

అంతా కలిసి రకరకాల వంటకాలు చేశారు కానీ, అన్నింట్లోకీ వంకాయ పెరుగుపచ్చడే ఎక్కువ బాగుందని అంతా ఊదేశారు. లేడి మాంసం కూరయితే పాకాన పడలేదని కొందరు బాధపడ్డారు.

నేను ఓంప్రకాష్‌ని మెచ్చుకుని, "వంకాయ పెరుగుపచ్చడి ఇలా కూడా చెయ్యొచ్చని నాకు స్ఫురించలేదు. చాలా బాగుంది" అన్నాను.

ఓంప్రకాష్ వెంటనే, "ఇది నువ్వు చేసిన పాటోళీముందు దిగదుడుపు" అన్నాడు. అతనితో మరి నాలుగు గొంతులు కలిశాయి.

ఆ పాటోళీ వెను చిన్న కథ ఉంది.

శ్రీమతి వచ్చేలోగా మిక్సీ ఒకటి ఇంట్లో ఉండాలని నా కోరిక. ఇండియాలో ఉండగా మిక్సీ మా కల. కానీ నెల జీతం ఆరొందలైతే మిక్సీ ఖరీదు ఎనిమిదొందలు. అందుకని వాయిదా వేస్తూ వచ్చాం. అక్కడి అసాధ్యమిక్కడ సుసాధ్యం కాబట్టి వెంటనే మిక్సీ కొనాలనుకున్నాను. నేరుగా బ్రౌన్ కంపెనీ సేల్స్ కౌంటర్‌నుంచి కొంటే చవగ్గా వస్తుందని ఓంప్రకాష్ చెప్పాడు. అలా మిక్సీ కొన్నాక – ఒక రోజు నేను మిక్సీలో పెసరపప్పు రుబ్బి పాటోళీ చేశాను. భోంచెయ్యబోతుండగా ఓంప్రకాష్ మరో నలుగురితో కలిసి నా రూంకొచ్చాడు. వాళ్లకి పాటోళీ రుచి చూపిస్తే – బాగుంది బాగుందంటూ మొత్తం ఊదేశారు. వాళ్లు వెళ్లేక – నేను మరో కూర వండుకోవాల్సి వచ్చింది.

అదే ఇప్పుడు ఓంప్రకాష్ గుర్తు చేశాడు.

హాస్టల్లో ఉండడంవల్ల శనివారం ఇట్టే గడిచిపోయింది. కానీ మర్నాడు ఇంట్లో గడపడంవల్ల ఆదివారం క్షణమొక యుగమైంది. మనసునిండా అనుమానాలు, బెంగతో ప్రతి యుగమూ మహాభారం.

సోమవారం ఆఫీసుకి వెళ్లాను. అంతా సెలవుల మూడ్‌లో ఉన్నారు. నా గోడు విన్నారో లేదో తెలియదు కానీ పనికొచ్చే సమాచారం కానీ. సూచనలు కానీ, సలహాలు కానీ నాకు లభించలేదు.

మధ్యాహ్నం ఓంప్రకాష్‌ని తీసుకుని ఏరోఫ్లోట్ ఆఫీసుకి వెళ్లాను. ఆశ్చర్యమేమిటంటే వాళ్లు కూడా నాకు శ్రీమతిని రిసీవ్ చేసుకునే విషయమై సరైన సమాచారమేదీ ఇవ్వలేకపోయారు.

అక్కణ్ణించి ఈస్ట్ జర్మనీ వీసా ఆఫీసుకి వెళ్లాం. వాళ్లు చెప్పిన ప్రకారం నేను వెస్ట్ బెర్లిన్లో బస్సెక్కి ఈస్ట్ జర్మనీలో ఎయిర్‌పోర్టుకి వెళ్లి నావాళ్లని రిసీవ్ చేసుకోవచ్చు.

వినడానికి బాగానే అనిపించినా – వాళ్లు చెప్పిన పద్ధతి నాకు ఏమాత్రం ప్రోత్సాహకరంగా అనిపించలేదు. పైగా భయం కూడా వేసింది.

ఇక వీసా తీసుకోవడం ఒక్కటే మంచి మార్గమని అర్థమైపోయింది. కానీ దానికి చాలా తతంగమున్నదిట. ఇప్పుడు మొదలెడితే ఇంకో నెల్లాళ్ల తర్వాత మాటట!

చేసేదేముంది? హతాశుణ్ణై అక్కణ్ణించి తొందరగా బయటపడి ఆఫీసుకి వెళ్లాను.

అప్పటికి రాలెక్ వచ్చాడు. ఆయనకి కటక్‌నుంచి తెచ్చిన ఫిలిగ్రీ (వెండి) ఐటం ఒకటి కానుకగా ఇచ్చాను. ఆయన ముఖంలో సంతోషంకంటే ఆశ్చర్యం ఎక్కువ కనబడింది.

"మీరింకా ఇక్కడే ఉన్నారా?" అన్నాడాయన. ఈ పాటికి నేను యూరప్ టూర్లో ఉంటాననుకున్నాడుట ఆయన.

నేనాయనకు మావాళ్ల ప్రయాణం గురించీ, ఇతర సమస్యల గురించీ చెప్పలేదు.

ఈలోగా నాకు ఓంప్రకాష్‌నుంచి ఫోను. ఆ మధ్య రెడ్డి అనే అతని భార్య ఏరోఫ్లోట్‌లోనే బెర్లిన్ వచ్చిందట. ఆమెని రిసీవ్ చేసుకుందుకు నారాయణస్వామి అనే అతను సాయపడ్డాడట. నారాయణస్వామి కూడా లియోపాల్డ్‌ప్లాట్జ్ హాస్టల్లోనే ఉంటున్నాడు. నేనతణ్ణి స్వయంగా కలుసుకుని మాట్లాడితే ప్రయోజనముండొచ్చు.

లియోపాల్డ్‌ప్లాట్జ్ హాస్టలు మెయిన్ గేటు – ఉదయం ఎనిమిదినుంచి రాత్రి ఎనిమిదివరకూ తెరిచే ఉంటుంది. మిగతా సమయాల్లో గేటు మూసి తాళం వేస్తారు. ఐతే హాస్టల్లో ఉండేవాళ్లందరికీ ఆ తాళానికి డూప్లికేట్ కీ ఉంటుంది. నేను ఎప్పుడు పడితే అప్పుడు హాస్టలుకొచ్చి వెడుతూండడానికని – హాస్టల్ మిత్రులు తమలో తాము అడ్జస్టు చేసుకుని నాకో డూప్లికేట్ కీ ఇచ్చారు.

నేను వెంటనే హాస్టలుకి వెళ్లి ఓంప్రకాష్‌తో కలిసి నారాయణస్వామిని చూడ్డానికి వెళ్లాను.

"అదంత సులభం కాదు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ తెలివిగా మసలాలి. ఇలాంటి విషయాల్లో నాకు నేనే సాటి. నేనుంటే నీ పని సులభంగా ఐపోయేది. కానీ రెండ్రోజుల్లో హాంబుర్గ్ వెళ్లిపోతున్నాను. సారీ!" అన్నాడతను.

ఆ పని నావల్ల కాదుట. తనవల్ల ఔతుంది కానీ, తనుండడట.

అతనిచ్చిన సమాచారం అతని గొప్పతనాన్ని తెలుసుకుందుకే తప్ప నాకే విధంగానూ ఉపయోగపడేలా లేదు.

అప్పుడు నా ఆలోచనలు చాలా దూరం వెళ్లాయి. శ్రీమతి, పిల్లలు ఈస్ట్ బెర్లిన్లో విమానం దిగి, తమని పలకరించే నాథుడు లేక అక్కడే ఉండిపోయి.....

"బాగా డల్లయిపోయావ్" అన్నాడు ఓంప్రకాష్ నా మొహం చూసి జాలిగా.

"నామీద జాలిగా ఉంది కదూ! కానీ నాకిప్పుడు కావాల్సింది జాలి కాదు" అన్నాను దిగులుగా.

ఓంప్రకాష్‌కి నా ఉక్రోషం అర్థమైనట్లుంది. చటుక్కున పక్కనున్న బల్లమీది అద్దం తెచ్చి నా ముందుంచి చేత్తో పట్టుకున్నాడు.

అద్దంలో నా ప్రతిబింబం చూసి ఎవరో అనుకుని, విపరీతంగా జాలిపడిపోయి, "ఈ మొహం చూస్తుంటే అనిపిస్తోంది, నాకంటే దీనదశలో ఉన్నవారు ఇంకా ఉన్నారన్నమాట!" అన్నాను అప్రయత్నంగా.

"ఆ మొహం నీదే! ఇప్పటి పరిస్థితుల్లో నువ్వు కూడా నిన్ను చూసి జాలిపడేలా ఉంది నీ మొహం. మరి నేను జాలిపడనా?" అన్నాడు ఓంప్రకాష్.

"నీ జాలికి సంజాయిషీ ఉంది. నా సమస్యకి పరిష్కారం లేదు" అన్నాను దీనంగా.

"అలా దిగులు పడకు. ప్రతి సమస్యకీ ఓ పరిష్కారం ఉంటుంది. అదేంటో నేను కనుక్కుంటాను. ఇకమీదట ఆ బాధ్యత నామీద పెట్టి నిశ్చింతగా ఉండు" అన్నాడు ఓంప్రకాష్.

అతనలా అనడానికి కారణముంది. ఆఫీసులో నా జర్మన్ కొలీగ్ హైనర్ డెకర్ట్ శ్రీమతి ప్రయాణ విషయమై నాకో ఆఫరిచ్చాడు. నావాళ్లని ఎయిరిండియాలో తీసుకొస్తే కనుక, టికెట్ ఆమ్‌స్టర్‌డామ్‌కి తీసుకోమన్నాడు. తను, భార్య ఆమ్‌స్టర్‌డామ్ ట్రిప్పు వేసుకుంటారుట. ఆ కార్లో నేనూ వెళ్లి – నావాళ్లను రిసీవ్ చేసుకుని, అంతా కలిసి ఆమ్‌స్టర్‌డామ్ నగరాన్ని సందర్శించుకుని సరదాగా గడిపి వెనక్కి వచ్చేద్దామన్నాడు.

ఆఫర్ బాగుంది. కానీ నాకు తెలిసి ఇండియాలో ఇలాంటి ఆఫర్స్ మాటవరసకి ఇస్తారు. నిజంగా మనం అడిగితే ఏదో వంక పెట్టి తప్పించుకుంటారు. అదీకాక నాకు ఆర్థికపరంగా ఎదుటివారికి భారం కావడం ఇష్టముండదు. ఆ విషయం ఒకసారి ఓంప్రకాష్‌కి చెప్పాను.

"ఇక్కడివాళ్లు మనవాళ్ళలా కాదు. సాయం చెయ్యాలనుంటే అడిగి కూడా చేస్తారు. ఇష్టం లేకపోతే అడిగినా నిర్మొహమాటంగా సారీ చెబుతారు. కాబట్టి నువ్వు నీ మిత్రుడి మాటలు నమ్మొచ్చు. కానీ ఎయిరిండియా టికెట్సు ఖరీదెక్కువ. ఏరోఫ్లోట్ ఐతే మనకి చౌకలో ఐపోతుంది" అన్నాడు ఓం ప్రకాష్.

ఓంప్రకాష్ ఇప్పుడది గుర్తు చేసుకుని, "ఏరోఫ్లోట్ ప్రయాణంలో ఇన్ని ఇబ్బందులుంటాయని నేనూహించలేదు. కాస్త డబ్బెక్కువైనా ఎయిరిండియాలోనే బుక్ చెయ్యాల్సింది. జరిగిందిప్పుడు వెనక్కి తీసుకోలేం. జరిగిందానికి బాధ్యత నాది కాబట్టి, నీకిప్పుడు నేనే ఏదో ఓ దారి చూపించాలి, చూపిస్తాను" అన్నాడు.

మర్యాదకి అతనలా అన్నాడు కానీ – అన్ని విషయాలూ కూలంకషంగా విచారించకపోవడంలో తప్పు నాది. విమానం బెర్లిన్ అంటే నేరుగా బెర్లిన్‌కే వస్తుందనుకున్నాను తప్ప ఆ వచ్చేది ఈస్ట్ బెర్లిన్‌కి అయుండొచ్చని తట్టలేదు. ఆపైన తూర్పు బెర్లిన్ విమానాశ్రయం – నగర సరిహద్దుల్లో కాకుండా తూర్పు జర్మనీలో భాగంగా ఉంటుందనీ ఊహకందలేదు.

ఆ విషయం అతనికి చెప్పాను.

"ఈ డిస్కషనంతా వేస్ట్. మనమిప్పుడు పని చూడాలి. మాది మామూలు హాస్టలు కాదు. ఇండియాలో బెస్ట్ బ్రెయిన్సన్నీ చేరి ఇక్కడ ఉపాయాల పుట్టలు పెట్టాయి. ఏ పుట్టలో ఏముంటుందో! ఇంతవరకూ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నాం. నౌ ఆయాం సీరియస్. పద" అన్నాడు.

ప్రతి మనిషికీ మనసుంటుంది. మనసుంటే మార్గముంటుంది. ఆ రెండు విషయాలూ తరచుగా విస్మరించి దిగులు పడ్డం మనిషికి మామూలు.

మేమింకా అడక్కుండానే, నా సమస్యకి పరిష్కారం హాస్టల్లో ఓ వ్యక్తి రూపం దాల్చి మాకోసం ఎదురుచూస్తోంది. ఆ రూపం పేరు నాని.

నాని అసలు పేరు అది కాదు. కానీ అక్కడంతా అతన్నలాగే పిలుస్తారు. బ్రహ్మచారి. నాకులాగే శాకాహారి. మైసూర్‌లో స్థిరపడ్డ ఆంధ్రుడు. తెలుగు బాగా మాట్లాడగలడు.

"మీ సమస్య గురించి విన్నాను. ఇది ముందే నాకెందుకు చెప్పలేదు?" అన్నాడతను.

"ఏం చెప్పను? చెప్పినచోటల్లా మొండి చెయ్యే ఎదురైంది" అందామనుకుని ఊరుకున్నాను.

"నేను చేస్తున్న కోర్సులో తూర్పు జర్మనీకి టూర్లు పడుతుంటాయి. అక్కడికి ఎప్పుడు కావాలంటే అప్పుడు తక్షణం వీసా పొందే సదుపాయముంది నాకు. నేను వీసా తీసుకుని మీవాళ్లని రిసీవ్ చేసుకోగలను" అన్నాడతను.

కొండంత భారం దిగినట్లయింది. నానిని చూస్తే శ్రీకృష్ణపరమాత్మలా కనిపించాడు.

ఓంప్రకాష్ నానిని కౌగలించుకుని, "థాంక్యూ వెరీమచ్! నా పరువు కాపాడేవు" అన్నాడు.

నాని అతన్ని విడిపించుకున్నాడు. నాకో కాగితం చూపించాడు. అది తూర్పు జర్మనీ అతనికిచ్చిన అనుమతి పత్రం.

"హుర్రే" అని అరవాలనిపించింది. నిభాయించుకున్నాను.

ఐనా మనసులో ఏదో మూల పీకుడుంటుంది కదా! మర్నాడు నానితో కలిసి వీసా ఆఫీసుకెళ్లి నానికి వీసా తీసుకునేదాకా అదలా పీకుతూనే ఉంది.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను. హాస్టల్‌కి బై చెప్పాను. నా రూంకెళ్లాను.

లియోపాల్డ్‌ప్లాట్జ్ హాస్టలు ఓ ఉపాయాల పుట్ట అన్నాడు ఓం ప్రకాష్. మరి నాకేమో గ్యోతే స్ట్రాసేలోని నా ఇల్లొక అనుమానాల పుట్ట.

నేను పంపిన టికెట్లు సకాలంలో ఇండియా చేరుకుంటాయా? అన్నయ్య పాస్‌పోర్టు వగైరాలు సకాలంలో ఏర్పాటు చెయ్యగలడా? మాస్కోలో ఏడు గంటలుండి విమానం మారే ప్రయాణానికి శ్రీమతి మానసికంగా సంసిద్ధమౌతుందా?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలియాలంటే నావాళ్లనుంచి ఉత్తరాలు రావాలి. శ్రీమతి తన ఉత్తరాలన్నీ ఆఫీసు అడ్రసుకే వ్రాస్తుంది. ఇప్పుడు ఆఫీసుకి వరుస సెలవులు.

ఇకమీదట ఉత్తరాలన్నీ ఇంటి అడ్రసుకే వ్రాయమని చెప్పకపోవడం నేను చేసిన పొరపాటు.

ఎందుకిలా జరిగిందని నన్ను నేనే తిట్టుకుంటుంటే చటుక్కున ఓ విషయం గుర్తొచ్చింది.

ప్రస్తుతం సెలవులే ఐనా డిసెంబర్ 27, 31 తేదీలలో – ఉదయం పదినుంచి సాయంత్రం మూడున్నరవరకూ ఆఫీసు తెరచి ఉంచుతారు. జనవరి 2నుంచి ఆఫీసు మళ్లీ మామూలు వేళల్లో పని చేస్తుంది. ఆ విషయం నోటీసు బోర్డులో చదివాను.

అందుకని డిసెంబర్ 27న ఒంటిగంటకి బయల్దేరి ఆఫీసుకి వెళ్లాను.

జర్మనీలో ప్రతి హాస్టలుకీ, భవనానికీ, సంస్థకూ ఒక సూపర్వయిజర్ ఉంటాడు. వాటికి సంబంధించిన తాళాలన్నీ అతనివద్దనే ఉంటాయి. అతన్ని హౌస్ మయిస్టర్ అంటారు. మయిస్టర్ అంటే ఇంగ్లీషులో మాస్టరు.

నేను వెళ్లేసరికి హౌస్ మెయిస్టర్ సంస్థ ముఖద్వారానికి తాళం పెడుతున్నాడు. నన్ను చూడగానే ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

“లోపల నాకు పని ఉంది” అన్నాను.

“సంస్థకి సెలవు. లోపలకి వెళ్లకూడదు” అన్నాడతను.

“ఆ విషయం నాకు తెలుసు కానీ....” అని ఆగాను. ఆ రోజు మూడున్నర దాకా ఆఫీసు తెరిచే ఉంటుందన్న నోటీసు గురించి చెప్పడానికి సంకోచించాను. నిజమే ఐనా, చెబితే చిన్నబుచ్చినట్లవుతుందని మొహమాటపడ్డాను.

“తిరిగి రెండో తేదీనే ఆఫీసు ప్రారంభమయ్యేది” అన్నాడు హౌస్ మయిస్టర్ నా మాట పట్టించుకోకుండా.

“లోపల చిన్న పని ఉంది” అన్నాను అభ్యర్థనగా.

అతను మెత్తబడ్డాడు, “వెళ్లిరా, వెయిట్ చేస్తాను” అన్నాడు.

లోపలకెడితే ఆఫీసు సెక్రటరీ గది తాళం వేసి ఉంది. నాకొచ్చే ఉత్తరాలు ఆ గదిలోనే ఉంటాయి.

వెనక్కొచ్చి హౌస్ మయిస్టర్‌కి ధన్యవాదాలు చెప్పాను.

“బిట్టే షోన్” (నోమెన్షన్‌కి వాడే పదం) అని అతను వెళ్లిపోయాడు.

అర్థమైంది. ఎక్కడైనా మనుషులంతా ఒక్కటే. పండుగ సమయాల్లో ఇక్కడివాళ్లూ నియమాలు అంత ఖచ్చితంగా పాటించరన్న మాట!

నోటీసు ప్రకారం ఆఫీసు మూడున్నర దాకా తెరిచుంచాలి. హౌస్ మయిస్టర్ వాటం చూస్తుంటే – డిసెంబర్ 31న అసలు ఆఫీసు తలుపులే తెరిచేలా లేదు.

“పాపం – అతనికీ పండుగే కదా” అనుకున్నాను. అదీకాక అతను తలుపులు తెరవకపోయినా ఎవరికీ ఇబ్బంది ఔతుందనుకోను. ఏడాది మాత్రం ఉండి వెళ్లేవాణ్ణి కాబట్టి నాకివ్వలేదు కానీ, చాలామంది రీసెర్చర్స్ వద్ద మాస్టర్ కీ ఉంటుంది. అదుంటే ఎవరికి వారు ఎప్పుడు పడితే అప్పుడు ఆఫీసుకి వస్తూపోతూండొచ్చు.

ఏమైతేనేం – జనవరి 2దాకా, అంటే మరో ఆరు రోజులవరకూ నాకు ఉత్తరాలు దొరకవు.

వండుకోవడం, తినడం, తిరగడం, పడుకోవడం. మధ్యమధ్య హాస్టలుకెళ్లి ఓంప్రకాష్ బృందంతో గడపడం. ఇదీ నా దినచర్య. వాటిలో డిసెంబర్ 28 రాత్రి అనుభవం మరువలేనిది.

*పరీక్షా సమయం*

ఆ రాత్రి అక్కడే ఉండిపోయాను. ఆటపాటలతో రాత్రి రెండయ్యేదాకా మెలకువగానే ఉన్నాం.

అన్నాళ్ల పరిచయంలో ఆల్కహాల్ విషయంలో లేని ఒత్తిడి ఆ రాత్రి నామీద పడింది.

అంతా వైన్ తీసుకుంటూ నన్నూ బలవంతపెట్టారు. మృదువుగా నిరాకరించాను.

“ఈ ఒక్కసారికి. ప్లీజ్, నాకోసం” అన్నాడు ఓంప్రకాష్.

“నో ఫోర్స్ ప్లీజ్” అన్నాను ఇంకా మృదువుగానే.

“వైన్ అంటే ద్రాక్షరసం. ఇది విస్కీ, బ్రాందీల లాంటిది కాదు” అన్నాడు ఓంప్రకాష్.

“నేను ద్రాక్షరసం తాగాలన్నది నీ కోరిక ఐతే, తప్పక తాగుతాను” అంటూ అక్కడ ప్లేట్లో ఉన్న ద్రాక్షపళ్లలో రెండు నోట్లో వేసుకుని – “ఆహా, వీటి రసం ఎంత మధురంగా ఉంది!” అన్నాను.

ఓంప్రకాష్‌కి కాస్త కోపమొచ్చింది. “అయితే వైన్ తాగుతున్న మేమంతా పాపాత్ములమనా, నీ అభిప్రాయం?” అన్నాడు.

“తాగడం పాపం కాదు. తాగినవాళ్లు పాపాత్ములు కారు. కానీ ఇష్టం లేనివాళ్లని తాగమని బలవంతపెట్టడం పాపం” అన్నాను నవ్వుతూనే.

కానీ అక్కడి వాతావరణం చూస్తుంటే నాకు మనసులో భయం మొదలైంది.

అంతమందిలో నేనొక్కణ్ణి. నిషా తలకెక్కితే వాళ్లు నన్ను బలవంతం చేసినా చెయ్యొచ్చు.

తాగితే ఏదో ఐపోతుందని కాదు. ఇష్టం లేనప్పుడు బలవంతాన తాగడమెందుకు?

ఓంప్రకాష్ కోపం తగ్గింది, “యూ ఆర్ గ్రేట్. ఓకే, యూ రిమెయిన్ గ్రేట్” అన్నాడు నవ్వి.

ఈ తాగుడు తతంగం రాత్రి పదికి మొదలై – రెండయ్యేదాకా కొనసాగింది.

“కనీసం కంపెనీకైనా నువ్వేం తీసుకోవడం లేదు” అన్నాడు ఓంప్రకాష్.

“కంపెనీకి గ్లాసే ముఖ్యం. గ్లాసులో ఏముందన్నది కాదు....” అంటూ నేనో గ్లాసందుకుని, అందులోకి ఆపిల్ జ్యూస్ ఒంపుకున్నాను. వాళ్లు వైన్ సిప్ చేస్తున్నట్లే నేనది సిప్ చేశాను.

మా మధ్యలో ఒక గాజు పళ్లెముంది. దాంట్లో వేరుసెనగ పప్పులున్నాయి. మధ్యమధ్య అది నములుతున్నాం.

ఆ గదిలో మొత్తం ఎనమండుగురం. నేను తప్ప అంతా వైన్ పుచ్చుకుంటున్నారు. అందరినుంచీ  ఆల్కహాలు వాసన. అందరి కళ్లూ ఎర్రజీరలతో, మత్తుగా, అదోలా ఉన్నాయి.

వాళ్లనలా చూడ్డం నాకదో అనుభూతి. వాళ్లకి వాళ్లమధ్య నేనో వింత.

కానీ నేను నన్ను నిగ్రహించుకోవడం లేదు. నాలో కోర్కెని చంపుకోవడం లేదు. వారికి అమృతప్రాయమైన ఆ పానీయం నాలో ఏ ఆసక్తినీ కలిగించడం లేదు. అది నా అదృష్టమని నేననుకోవచ్చు. దురదృష్టమని కొందరనుకోవచ్చు. కానీ విషయమదే!

“ఐ కాన్ట్ బట్ అడ్మయిర్ యువర్ కంట్రోల్” అన్నాడు నాని అభినందనపూర్వకంగా.

“ఈజిట్ అప్రీసియేషన్ ఆర్ పిటీ” అన్నాను నేను వెంటనే.

“ఇటీజ్ సింపుల్ అప్రీసియేషన్. మరి నీకా డౌటెందుకొచ్చింది?” అన్నాడు నాని. అతను తనని నాన్ ఆల్కహాలిక్ అనే అనుకుంటాడు. ఎందుకంటే అతను తీసుకునేవి వైను, బీరు మాత్రమేనట. అవి ఆల్కహాలు కింద లెక్క రావట. వైన్ వల్లనే తనీ జర్మనీ వాతావరణంలో మనగలుగుతున్నానంటాడతను.

"అది ఆల్కహాలవనీ, వైనవనీ, బీరవనీ – ఆ అలవాటు చెడ్డదని మీరు భావిస్తున్నారని నేననుకోను. అలా భావించి ఉంటే మీరూ ఆ అలవాటుకి దూరంగా ఉండేవారు. ఇందులో మీరేదో ఆనందం పొందుతున్నారు. ఆ ఆనందానికి నేను దూరమౌతునాన్నని జాలి పడుతున్నారు. ఆ జాలితోనే తాగమని నన్ను బలవంత పెడుతున్నారు" అన్నాను.

"ఆమాత్రం గ్రహించావుగా – కాబట్టి నేను చెప్పేది విను డాక్టర్ రావ్! ఈ వైన్‌లో మజా తెలుసుకుందుకైనా ఒక్కసారి నువ్వు తాగాలి. జీవితంలో నీకిది అపూర్వావకాశం. మళ్లీ దొరుకుతుందో లేదో తెలియదు. ఎందుకంటే ఈ క్వాలిటీ మన దేశంలో దొరకదు. దొరికినా ధర మనబోటిగాళ్లకి అందుబాటులో ఉండదు" అన్నాడు ఓంప్రకాష్ అభ్యర్థనగా.

అతనన్నది నిజమే. మన దేశంలో వందల రూపాయల ఖరీదుండే బ్లాక్ అండ్ వైట్ విస్కీ బాటిల్ ఇక్కడ పదకొండు మార్కులు. అపురూపంగా భావించి తక్కువ డోసుల్లో పుచ్చుకునే కోన్యాక్ బ్రాందీ బాటిల్ ఇక్కడ పదమూడు మార్కులు.

"నేను తాగినా తాగకపోయినా, మీ మనసుకి తృప్తి కలిగించే కథ ఒకటి చెబుతాను" అన్నాను.

"తృప్తి అంటే మాకు కిక్‌తోనే వస్తుంది. నువ్వు తాగకుండా మాకు కిక్ ఇవ్వగలవా?" అన్నాడు నాని.

నేను కథ చెప్పాను. "ఒకసారి లక్ష్మీదేవి, అదృష్టదేవత – నేను గొప్పంటే నేను గొప్ప అని తమలో తాము వాదించుకున్నారు. తమ గొప్పతనాన్ని నిరూపించుకుందుకు అప్పుడలా దారిన పోతున్న ఓ బికారిని ఎన్నుకున్నారు. లక్ష్మీదేవి బికారి నడిచే దారిలో బాట మధ్యలో బంగారు కాసుల మూట ఒకటి ఉంచింది. మూట కాస్త దూరంలో ఉందనగా బికారికి కళ్లు మూసుకుని నడవాలని కోరిక పుట్టింది. మూట దాటి వెళ్లేకనే వాడు కళ్లు తెరిచాడు. తనకి లక్ష్మీకటాక్షం కలిగినా కాసుల మూట పోగొట్టుకున్నానని వాడికి తెలియదు. కళ్లు మూసుకుని చాలా దూరం నడిచేనని తెగ మురిసిపోయాడు"

"కథ బాగుంది. ఇది మాకెందుకు చెప్పినట్లు?" అన్నాడు ఓంప్రకాష్.

"ఇండియాలో ఉండగా నేనెలాగూ వైన్ తాగలేని బికారినే. జర్మనీ వచ్చేక – ఇక్కడ తాగకుండా ఉండగలనా అని నన్ను నేను పరీక్షించుకోవాలన్న కోరిక పుట్టింది. వైను కటాక్షించినా ఏం లాభం?" అన్నాను.

అంతా ఘొల్లుమన్నారు. "ఐ అప్రీషియేట్ యువర్ సెన్సాఫ్ హ్యూమర్" అని, "యు ఆర్ గ్రేట్ అండ్ ఆల్సో మై గుడ్ ఫ్రెండ్. నీమీద నువ్వు జోక్స్ వేసుకుంటే నాకు నచ్చదు" అన్నాడు ఓంప్రకాష్ అభిమానంగా.

"ఆ విషయం నాకు తెలుసు. కానీ ఏంచెయ్యను? మీరు కిక్ ఇచ్చే కథ కావాలన్నారు. తాగేవాళ్లకి తాగనివాళ్లమీద వేసే జోక్స్ తాగుడుకంటే ఎక్కువ కిక్కిస్తాయి" అన్నాను.

అంతా మళ్లీ ఘొల్లుమన్నారు. "కిక్ ఇచ్చినట్లు లేదు. కిక్ చేసినట్లుంది" అన్నాడు ఒకతను.

"ఎలాగూ సందర్భం వచ్చింది కాబట్టి, మనమోసారి వివిధ దేశాల లైఫ్‌స్టయిల్సు గురించి చర్చిద్దామా?" అన్నాడు నాని.

వెంటనే ఒకతను, "మన దేశంలో ఒక పెద్ద లోపముంది. ఇది మంచి, ఇది చెడు అని చిన్నప్పట్నించీ బ్రెయిన్ వాష్ చేస్తారు పెద్దవాళ్లు. అందువల్ల పిల్లలు మానసికంగా ఎదగడంలేదు" అన్నాడు.

"ఇక్కడి లోపంతో పోలిస్తే మన లోపం మరీ పెద్దదేం కాదు. ఇక్కడ పిల్లలకు పెద్దల ప్రేమానురాగాలు లభించడం లేదు. పదేళ్ల పసిప్రాయంలోనే ఎవరి బతుకు వాళ్లు బతకాల్సి వస్తోంది. అది ఎదుగుదలకి మంచిదనుకోను" అన్నాను నేను.

దీనికి ఓంప్రకాష్ అభ్యంతరం చెప్పాడు, "నీకు డబ్బుంది కదా అని నువ్వు నీ కొడుకుని చదివిస్తున్నావు. కూలివాడు డబ్బులేక తన కొడుకుని కూడా కూలిపనిలో పెడుతున్నాడు. వాస్తవంలో కూలివాడి కొడుకు నీ కొడుకుకంటే తెలివైనవాడవచ్చు. కానీ వాడికి తన సామర్థ్యం నిరూపించుకునేందుకు నీ కొడుకుతో సమంగా అవకాశాలు లభించడం లేదు. అందుకే మన దేశంలో ధనికులెప్పుడూ ధనికులుగానూ,

పేదలెప్పటికీ పేదలుగానూ ఉండిపోతున్నారు. కాస్త కలిగిన ఇంట యువతీయువకులు పెద్దల చాటు బిడ్డలుగా పెరుగుతున్నారు తప్ప తమకంటూ వ్యక్తిత్వాల్ని సంతరించుకోలేకపోతున్నారు. అందువల్ల సంప్రదాయం బలపడి మానసికమైన ఎదుగుదలని దెబ్బ తీస్తోంది. ఇది ఎంతవరకూ దారి తీసిందంటే, నెహ్రూ ఒకసారి ప్రధానమంత్రి కాగానే – ఆ పదవికి ఆయన కుటుంబాన్ని దాటి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయింది మనవాళ్లకి. ఇందుకు చాలామంది నెహ్రూ కుటుంబాన్ని తప్పు పడతారు. కానీ తప్పు మన వ్యవస్థది. మరి ఇక్కడ చూడు. పదేళ్లు దాటినవాళ్లు తలిదండ్రుల చాటు బిడ్డలుగా కాక, తమ వ్యక్తిత్వాలకి అనుగుణంగా పెరుగుతారు. ఇక్కడి పిల్లలకుండే మానసిక పరిణతి మనవాళ్లకి ఉండదు”

ఓంప్రకాష్ మాటల్లో వాస్తవమున్నదనిపించింది. మన వ్యవస్థ గురించి ఈ మాత్రం లోతుగా ఆలోచించడం నాకతడిపై గౌరవాన్ని పెంచింది. ఆ చర్చ కొనసాగించాలనుకున్నాను.

“నాగరికత ఇప్పటి స్థాయికి చేరుకోవడానికి కారణం సమిష్టి కృషి. ఎప్పటికప్పుడు ఎవరికివారు తమకు తోచిన రీతిలో తమ తమ వ్యక్తిత్వాల్ని పెంపొందించుకోవాలనుకుంటే – నాగరికత ఈనాటి స్థాయికి చేరుకునేది కాదేమో! పదినుంచి ఇరవైఏళ్ల వయసు మనిషికి పరీక్షా సమయం. అప్పుడు కోరికలు గుఱ్ఱాలై పరుగులు తీస్తుంటాయి. అప్పుడే అతడికి అదుపు అవసరం. అదీకాక తనకోసం మాత్రమే తన బ్రతుకనునేవారికి జీవితంలో సంతృప్తి ఉండదు. సంతృప్తి త్యాగంనుంచి పుడుతుంది. జీవితమంటే – భార్యాబిడ్డలకోసం, తలిదండ్రులకోసం, దేశం కోసం – అన్న రాగానుబంధం లేకపోతే మనిషికి సంతోషముండదు. కన్నబిడ్డల్ని గాలికి వదిలి తమ మానాన తాము బ్రతికే తలిదండ్రులు ఏదో ఒకరోజున అసంతృప్తికి గురౌతారు” అన్నాను.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments